ఆంధ్రజ్యోతి



ఎల్‌ఆర్‌ఎస్ కోసం హెల్ప్‌డెస్క్‌లు

మేడ్చల్, (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల కోసం మేడ్చల్ కలెక్టరేట్‌లోని ఎంఎస్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ రాధికాగుప్తా మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయిలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం కలెక్టరేట్‌లో, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఏలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలని సూచించారు.

- సరూర్‌నగర్‌లో అత్యధికంగా 149.1మి.మీ వర్షపాతం నమోదు
- వరద ప్రవాహానికి మేడికుంట కట్టకు గండి
- పొంగి ప్రవహించిన వాగులు, వంకలు
- వికారాబాద్ జిల్లాలో దెబ్బతిన్న పంటలు
- నిండుగా ప్రవహిస్తున్న మూసీ నది
- మదనపల్లిలో ఇళ్లలోకి వరద నీరు
- పొంగిపొర్లిన దోర్నాల్ వాగు



మైలార్‌దేవరంపల్లిలో వరదకు నేలకొరిగిన పత్తి పంట



నాగారం మున్సిపాలిటీ సాయినగర్‌కాలనీలో నిలిచిన వరద నీరు

కుండపోత

ఉమ్మడి జిల్లాలో దంచికొట్టిన వాన ›› జలమయమైన లోతట్టు ప్రాంతాలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వర్షం దంచి కొట్టింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు 24 గంటల పాటు భారీ వర్షపాతం నమోదైంది. మంగళవారం తెల్లవారు జాము నుంచి పలు చోట్ల కుండపోతగా వాన పడింది. ఈసీ, మూసీ నదులు ఉప్పొంగాయి. దీంతో హైదరాబాద్‌కు తాగునీరు అందించే హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లకు భారీగా వరదనీరు చేరుతోంది. ఈ సీజన్‌లో ఇదే అతిపెద్ద వర్షంగా చెప్పవచ్చు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత కూడా చాలా చోట్ల విస్తారంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో చెరువులు, కుంటల్లోకి భారీగా వరద నీరు చేరింది. చెక్‌డ్యాంలు అలుగు పారాయి. ప్రధాన మార్గాలు, కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. పలు ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని నగర శివార్లలోని పలు కాలనీలు నీట మునిగాయి. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ ట్రాన్స్‌పోర్టు బిల్డింగ్ వద్ద రికార్డు స్థాయిలో 149.1 మి.మీ వర్షపాతం నమోదైంది. మేడ్చల్ జిల్లా బాలానగర్‌లో 140 మి.మీ, ఉప్పల్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ ఆఫీస్ వద్ద 135.0 మి.మీ వర్షపాతం నమోదు కాగా వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 98.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లాలో వందల ఎకరాల్లో పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఇదిలా ఉంటే వాతావరణ పరిస్థితుల అనుకూలించక ఇప్పటికే పలు మండలాల్లో ఆశించిన స్థాయిలో పంటలు సాగు జరగలేదు. ఇప్పుడు కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా కొన్ని పంటలకు నష్టం జరుగుతోంది. ముఖ్యంగా కూరగాయ, ఉద్యాన పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లుతోంది.

వికారాబాద్/మేడ్చల్ (ఆంధ్రజ్యోతి) ఆగస్టు 20: వికారాబాద్ జిల్లాలో మంగళవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. వికారాబాద్, యాలాల్, కులకచర్ల, దోమ, కొడంగల్, పూడూరు, కోట్‌పల్లి, పరిగి మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రెండు నుంచి మూడు గంటల పాటు కురిసిన ఈ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. వికారాబాద్ మండలంలో మైలార్‌దేవరంపల్లి, కోట్‌పల్లి మండలం, జిన్నారం గ్రామాల్లో వాగులు పొంగి ప్రవహించడంతో పక్కనే ఉన్న పంటలు నీట మునిగాయి. పత్తి, పసుపు పంటలతో పాటు వివిధ కూరగాయల పంటలు, పూల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ రెండు గ్రామాల్లోనే 500 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. కాగా, భారీ వర్షానికి క్షేత్ర స్థాయిలో జరిగిన పంట నష్టం మరింత ఎక్కువగా ఉండవచ్చని తెలుస్తోంది. వికారాబాద్ మండలంలో కురిసిన వర్షానికి మదన్‌పల్లిలో చెక్‌డ్యాం కట్ట తెగి గ్రామంలోకి భారీగా వరద నీరు చేరింది. గ్రామంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. గిరిగెట్‌పల్లి వాగు పొంగి ప్రవహించడంతో రైల్వే బ్రిడ్జి కిందకు భారీగా వరద నీరు చేరుకోవడంతో వికారాబాద్ - గిరిగెట్‌పల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కురిసిన వర్షానికి చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు చేరింది.

నీట మునిగిన పంట పొలాలు

భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో జిన్నారం, మైలార్‌దేవరంపల్లి గ్రామాల పరీవాహక ప్రాంతాల్లో పంట పొలాలు జలమయమయ్యాయి. ఎదుగుతున్న పంటలు పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈసారి పంటలు చేతికి వస్తాయని ఆశపడితే కురిసిన భారీ వర్షం ఆశలు గల్లంతు చేసిందంటూ బాధిత రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



మేడికుంటకు గండి.. వృథాగా పోతున్న నీరు

ఇళ్లలోకి వరద నీరు

వికారాబాద్/ ధారూరు/ బంట్వారం (కోట్‌పల్లి)/ యాలాల/నవాబుపేట : మదనపల్లిలో గుట్టపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో చెక్ డ్యామ్ కట్ట తెగిపోయింది. దీంతో వరద నీరు ఇండ్లలోకి చేరింది. సామగ్రి నీటిలో తడిసి పోయాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్ ధారూరు, దోర్నాల్ గ్రామాల మధ్య ఉన్న వాగు పొంగి పొర్లి తాత్కాలిక వంతెన పై నుంచి ప్రవహించింది. దీంతో నాగారం, దోర్నాల్ గ్రామాల వైపు నుంచి ధారూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. కోట్‌పల్లి మండల పరిధిలోని జిన్నారం నాగసాన్‌పల్లి, కంకణాలపల్లి ఎన్నారం తదితర గ్రామాల్లో వర్షానికి వాగులు

మిగతా 7వ పేజీలో...

గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం

మండలం	ప్రాంతం	వర్షపాతం (మి.మీ)
రంగారెడ్డి జిల్లా..		
సరూర్‌నగర్	జీహెచ్‌ఎంసీ ట్రాన్స్‌పోర్టు బిల్డింగ్	149.1
రాజేంద్రనగర్	రాజేంద్రనగర్ (ఏఆర్‌ఎస్)	125.0
సరూర్‌నగర్	ఎల్బీనగర్ (జీహెచ్‌ఎంసీ ఆఫీస్)	125.3
రాజేంద్రనగర్	జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఆఫీస్	106.0
సరూర్‌నగర్	అలకపూరి కమ్యూనిటీ హాల్	104.3
రాజేంద్రనగర్	శివరాంపల్లి	93.8
సరూర్‌నగర్	రాక్‌టౌన్ కాలనీ	90.0
రాజేంద్రనగర్	శాస్త్రీపురం	81.8
రాజేంద్రనగర్	లింగోజిగూడ	80.0
మేడ్చల్ జిల్లా..		
బాల్‌నగర్	ఫతేనగర్	140.3
ఉప్పల్	జీహెచ్‌ఎంసీ ఆఫీస్	135.0
ఉప్పల్	న్యూ నాగోల్ వెల్ఫేర్ అసోసియేషన్	124.6
కాప్రా	ఈఎస్‌ఎస్ మల్కారం	115.0
ఉప్పల్	మారుతి నగర్	105.5
కుత్బుల్లాపూర్	వార్డు ఆఫీస్, గాయత్రీనగర్	138.0
మేడ్చల్	ఇండస్ట్రియల్ ఏరియా	96.8
కుత్బుల్లాపూర్	ఈఎస్‌ఎస్ జీడిమెట్ల	93.5
మల్కాజిగిరి	వినాయకనగర్	77.5
వికారాబాద్ జిల్లా..		
వికారాబాద్	మర్పల్లి	98.3
యాలాల్	యాలాల్	71.3
కుల్కచర్ల	ముజాహిత్‌పూర్	66.8
దోమ	దోమ	66.0



చేవెళ్ల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది



నవాబుపేటలో నిండుగా ప్రవహిస్తున్న మూసీ నది

ఉప్పొంగిన మూసీ

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపాలిటీతో పాటుగా మండలంలో మంగళవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. సుమారు 9సెం.మీల వర్షం కురిసింది. వికారాబాద్ ప్రాంతంలో పెద్ద ఎత్తున వర్షం కురవడంతో మూసీ వాగు ఈసీజన్‌లో మొదటిసారిగా ఉప్పొంగింది. ఈ వర్షంతో పంటలకు జీవం వచ్చినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టంగటూరు ఉన్నత పాఠశాల ఆవరణలోకి వరద నీరు చేరడంతో అది చెరువును తలపించింది.

నిండుకుండలా గొర్లకుంట చెరువు

కడ్తాల్ : కడ్తాల్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. కడ్తాల్ సమీపంలోని గొర్లకుంటలోకి భారీగా వరద నీరు చేరడంతో నిండుకుండలా మారింది. మేడికుంటలోకి పెద్ద ఎత్తున చేరుతుండడంతో నీటి ప్రవాహానికి కుంట కట్టకు గండి పడింది. దీంతో పెద్ద ఎత్తున గండి నుంచి నీరు వృథాగా పోతుంది. గండిని వెంటనే పూడ్చి నీరు వృథా కాకుండా చూడాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులను కోరారు. కుంట కట్టను పరిశీలించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంచందర్‌నాయక్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, జహంగీర్‌అలీ, గూడెపు జంగయ్య, రవి, తదితరులు ఉన్నారు.

జలపాతం.. కనువిందు



కురుస్తున్న భారీ వర్షాలతో అనంతగిరులు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. నందిఘాట్ నుంచి వెళ్లే మార్గంలో వాటర్ ఫాల్స్ వచ్చాయన్న విషయం తెలుసుకున్న స్థానికులు, పర్యాటకులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. జలపాతం ప్రవహించే మార్గం ప్రమాదకరంగా ఉండడంతో అటువైపు వెళ్లకుండా అటవీ అధికారులు చర్యలు తీసుకున్నారు. - వికారాబాద్, ఆగస్టు 20

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

›› వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, ఆగస్టు 20: నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కడా కింద మంజూరైన నిధులతో అభివృద్ధి పనుల వేగవంతంతో పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం కొడంగల్‌లోని కడా కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులపై నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి నారాయణ, వికారాబాద్ జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు తమ శాఖలకు నిర్దేశించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు. మంజూరైన పనులకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులను ప్రారంభించాలన్నారు. వివిధ కళాశాలల నిర్మాణం కోసం భూ సేకరణ చేపట్టాలని, భూ సేకరణ విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కొడంగల్‌లో ప్రభుత్వాసుపత్రుల భవనాల నిర్మాణాల నమూనాలు, ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. మిషన్‌భగీరథ కింద ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కడా కింద నియోజకవర్గంలో మంజూరైన చెక్ డ్యాంల నిర్మాణ పనులపై, అటవీ శాఖ భూముల్లో జరుగుతున్న పనులపై సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. రోడ్లలో ఎక్కడ కూడా గుంతలు ఉండరాదని, ప్యాచ్ వర్క్ పనులను చేపట్టాలన్నారు. ప్రతీ వారం నిర్వహించే సమీక్షలో ప్రోగ్రెస్ ఉండాలని, నియోజకవర్గానికి సంబంధించిన మన ఊరు-మనబడి కింద చేపట్టిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

దరఖాస్తుల పరిశీలనకు శిక్షణ

వికారాబాద్, ఆగస్టు 20: పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు టీం మెంబర్లను ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నందు మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌ఐలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను యాప్ ద్వారా ఏవిధంగా వెరిఫికేషన్ చేయాలనే విధానాన్ని పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. వెరిఫికేషన్ మెంబర్లు రేపటి నుంచిఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రారంభించాలని ఆదేశించారు. వెరిఫై చేసిన రిపోర్ట్‌ను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అనధ్రతరైజ్ లేఅవుట్స్‌లోని ప్లాట్లలో క్రమబద్ధీకరణకు మున్సిపాలిటీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు (స్థానికసంస్థలు) సుధీర్, లింగ్యానాయక్, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ అహమ్మద్, విక్రంసింహారెడ్డి, బలరాంనాయక్, మాధవి, ఆర్‌ఐలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మేడ్చల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, జనజీవనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ మరో ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. విద్యాసంస్థల సెలవులపై కలెక్టర్లదే తుది నిర్ణయమన్నారు. పదిరోజుల్లో ధరణి దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. 23, 24 తేదీల్లో నూతన రెవెన్యూ ముసాయిదాపై జిల్లాలో వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ పర్యవేక్షణకు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు నియమించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజేందర్‌రెడ్డి, రాధికాగుప్తా, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు

కల్తీకల్లు తాగి 8మందికి అస్వస్థత

›› వికారాబాద్ మండలంలో ఘటన

వికారాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కల్తీ కల్లు తాగి ఎనిమిది మంది అస్వస్థతకు గురైన సంఘటన వికారాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన వారు వికారాబాద్ పట్టణంలోని వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ మండలం, పీరంపల్లి గ్రామంలో సోమవారం కల్తీ కల్లు తాగిన తరువాత రాత్రి నుంచి పలువురికి వాంతులు, విరేచనాలయ్యాయి. తగ్గడానికి టాబ్లెట్స్ వేసుకున్నా మంగళవారం ఉదయం వరకు తగ్గలేదు. దీంతో వాంతులు, విరేచనాలతో ఎక్కువగా బాధపడుతున్న లక్ష్మమ్మ, ప్రశాంత్, పెంటమ్మ, అంజమ్మ, రవీందర్ రెడ్డి, నాగమణి, సంతోషలతో పాటు మరొకరిని వికారాబాద్‌లోని మూడు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స కోసం చేర్పించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, పీరంపల్లి గ్రామంలో మరికొందరు వాంతులు, విరేచనాలతో మరికొందరు బాధపడుతున్నట్లు తెలిసింది. కల్లు తయారీలో ఉపయోగించే నీరు కలుషితంగా ఉండడం వల్లనే పీరంపల్లి గ్రామంలో పలువురు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైనట్లు ఆ గ్రామస్తులు చెబుతున్నారు.




ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పీరంపల్లి గ్రామస్తుడు



చెట్లే అన్నదమ్ములుగా.. రాఖీలు కట్టిన విద్యార్థినులు

రాఖీ పండుగను మంగళవారం పలు పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. పరిగి పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ నెంబర్ 1 పాఠశాలలో హెచ్‌ఎం గోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థినులు ఒకరికొకరు రాఖీలను కట్టుకున్నారు. అనంతరం చెట్లకు రాఖీలను కట్టి ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తామని పేర్కొన్నారు.

- పరిగి, ఆగస్టు 20



● నిబంధనలు పాటించని అధికారులు
● ఇష్టానుసారంగా ఫైన్లు వేస్తున్న పారిశుధ్య విభాగం
● ఇదేమిటంటే కమిషనర్ ఆదేశాలంటున్న వైనం

జరిమానాల్లో తేడాలెందుకో!

తాండూరు, ఆగస్టు 20: తాండూరు మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు ఇష్టానుసారంగా నిబంధనలు పాటించకుండా జరిమానాలు విధిస్తున్నారు. ఈ నిబంధనల ప్రకారం ఏ సెక్షన్ ప్రకారం ఫైన్లు వేస్తున్నారో చెప్పడంలేదు. తాము వేసిన జరిమానా కట్టాల్సిందేనని హుకూం జారీ చేస్తున్నారు. ఇది తాండూరు మున్సిపాలిటీలో ఆరు నెలలుగా కొనసాగుతున్న వ్యవహారం. ఇదేమిటని ప్రశ్నిస్తే మా కమిషనర్ సార్ ఆదేశానుసారంగా ఫైన్ వేస్తున్నామని సమాధానమిస్తున్నారు. గత మార్చి నెలలో ఇందిరా చౌక్‌లోనున్న మెట్రో మనీలా రెస్టారెంట్‌కు అపరిశుభ్రత పేరిట రూ.25వేల జరిమానా విధించారు. ఈ హోటల్‌పై ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. అయినా తనిఖీ పేరిట వచ్చి సానిటేషన్ విభాగం అధికారులు జరిమానా విధించారు. తాజాగా అదే ఇందిరాచౌక్ ప్రాంతంలోని మిలాప్ జ్యూస్ సెంటర్‌లో కుళ్లిన పండ్లు, ఫ్రూట్ సలాడ్‌లో పురుగులు రావడం అనారోగ్యం పాలయ్యేలా జ్యూస్‌లు ఉన్నాయంటూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఈనెల 16న ఈ జ్యూస్ సెంటర్‌ను మున్సిపల్ యంత్రాగం హంగామా చేసి సీజ్ చేశారు. రెండు రోజుల తర్వాత అదీ సెలవు రోజైన ఆదివారం పారిశుధ్య అధికారులు రూ.10వేలు జరిమానా విధించి జ్యూస్ సెంటర్ తెరిచేందుకు అనుమతించారు. ఆదివారం సెలవు రోజైనా ఇంత హడావుడిగా తెరవాల్సిన అవసరమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అపరిశుభ్రత పేరుతో ఇంతకు ముందే వేరే హోటల్స్‌కు ఎక్కువ జరిమానా విధించి ఈ జ్యూస్ సెంటర్‌కు మాత్ర రూ.10వేలు మాత్రమే జరిమానా విధించడంలో అంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై సానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్యను వివరణ కోరగా కమిషనర్ ఆదేశానుసారంగా ఓపెన్ చేశామని, కమిషనర్ చెప్పిన విధంగా జరిమానా విధించామని, తమ సొంతంగా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. దీన్నిబట్టి మున్సిపల్ అధికారులు సెటిల్‌మెంట్ చేసుకున్న వారికి ఒక విధంగా, నిలదీసిన వారికి మరో విధమైన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

శాంపిల్ పంపించకుండానే..!

మిలాప్ జ్యూస్ సెంటర్‌లో పురుగులు పట్టిన ఫ్రూట్ సలాడ్‌ను ఫుడ్ సెఫ్టీ అధికారులకు పంపించాలి. శాంపిల్‌ను ఫుడ్‌సేఫ్టికి పంపకుండానే స్థానిక కమిషనర్ తన స్థాయిలోనే నిర్ణయం తీసుకొని జరిమానా విధించారు. ఫిర్యాదు వచ్చిన తర్వాత నిబంధనల ప్రకారం ఫుడ్ సెఫ్టీ కార్యాలయానికి శాంపిల్‌ను పంపించి అక్కడి నుంచి వచ్చిన ఆదేశానుసారంగా చర్యలు ఉండాలి. తాండూరు మున్సిపాలిటీలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా జరిమానాలు విధిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వ్యాపార వర్గాల మౌనమెందుకు?

ఇష్టానుసారంగా జరిమానాలు విధిచడంపై వ్యాపార, వాణిజ్య వర్గాలు, సంఘాలు మౌనం వహించడంపై చర్చ జరుగుతోంది. నిబంధనలు పక్కకు పెట్టి ఉన్నతాధికారి ఫిర్యాదులు వస్తే చాలు తమకు నచ్చిన రీతిలో జరిమానాలు విధించడంపై ఎందుకు ప్రశ్నించడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ఈ సంఘాలు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్న చిరు వ్యాపారులు నుంచి వ్యక్తమవుతోంది. వేల రూపాయలు ఎలా కట్టాలని, ఇప్పటికైనా సంఘాలు స్పందించాలని పలువురు చిరు వ్యాపారులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ప్రతినిధులు

తాండూరు, ఆగస్టు 20: తాండూరు పట్టణంలో పది రోజులుగా తాగునీటి సమస్య తలెత్తిందని సమస్య పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని బీజేపీ నాయకులు ఖాళీబిందెలతో నిరసన తెలిపారు. తాండూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఖాళీ బిందెలు పెట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం ఏఈ ఖాజా హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రసుత్తం శ్రావణమాసం హిందువులకు ప్రత్యేక మాసమని, ఎన్ని పండుగలు వ్రతాలు, పూజలు ఉంటాయని, ఈ సమయంలో తాగునీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పక్కనే ఉన్న కాగ్నా నది నుంచి గతంలో మాదిరిగా నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన రోడ్లలో వీధిదీపాలు వెలగడంలేదని, జిల్లా ఆస్పత్రి వద్ద దుర్వాసనతో నిండిన మురుగు నీటిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, ఓబీసీ కార్యవర్గ సభ్యులు గాజుల శాంత్‌కుమార్, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు అంజనేయులు, తాండూరు అసెంబ్లీ కన్వీనర్ రజనికాంత్, పట్టణ ప్రధానకార్యదర్శి అంతారం కిరణ్‌కుమార్, శ్రీకాంత్, చందు, ప్రభాకర్ గౌడ్, వడ్డె సాయిలు పాల్గొన్నారు.

నాలుగు రోజులుగా నీళ్లు బంద్

గడిచిన నాలుగు రోజులుగా తాండూరులో తాగు నీటి సరఫరా బంద్ అయింది. శ్రీశైలం నుంచి సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పట్టణంలోని గాంధీనగర్, సర్రాఫ్ బజార్ ఏరియాల్లో బోర్లు లేక అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా మున్సిపాలిటీ అధికారులను నీటి ఎద్దడి సమస్యను తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి, తాగునీటి ఎద్దడి లేకుండా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.


















సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్

'స్థానిక' ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ఆమనగల్లు, ఆగస్టు 20 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీపీ సీఎల్.శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీ మహాసభ ఆధ్వర్యంలో మంగళవారం యూటీఎఫ్ భవన్‌లో.. 'బీసీలకు 42శాతం రిజర్వేషన్లు-సమగ్ర కులగణన'పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ నాగుల వేణు, మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ రవి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యయాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బీసీల రిజర్వేషన్ల పెంపు, ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలను విస్మరించే, నిర్లక్ష్యం చేసే పార్టీలకు స్థానిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి బీసీలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సదానందంగౌడ్, లాలూయాదవ్, గంగాధర్, రాజేందర్, గోపాల్, రమేశ్‌యాదవ్, రాఘవేందర్, మురళి, శ్రీనివాస్‌యాదవ్, జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.


ఇండుబ్రోలో షెడ్లను పరిశీలిస్తున్న అధికారులు

స్వయం ఉపాధితో ఎదగాలి

కేశంపేట, ఆగస్టు 20: స్వయం ఉపాధిలో యువత ఎదగాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత సూచించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మంగళవారం కేశంపేట కాకునూర్-కొండారెడ్డిపల్లి శివారులోని ఇండుబ్రో పౌల్ట్రీలో నాటుకోళ్ల మదర్ యూనిట్ సందర్శించారు. డీఆర్డీఏ పీడీ మట్లాడుతూ.. స్వయం సంఘాల ఆధ్వర్యంలో మహిళలు స్వయం సమృద్ధి సాధించాలన్నారు. కాకునూర్‌లో మోటె శ్రీను కోళ్ల ఫారాన్ని సైతం ఆమె పరిశీలించారు. 'పీఎం కుసుమ్' స్కీం కింద సోలార్ యూనిట్ ఏర్పాటుకు కేశంపేట సబ్‌స్టేషన్‌లో 2ఎకరాల ప్రభుత్వ భూమికి పరిశీలించారు. అనంతరం మానసిక పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అడిషనల్ డైరెక్టర్ సూర్యరావు, ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్లు బాలరాజు, స్వర్ణలత, నరసింహ, ఇన్‌చార్జి ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఏఈ నర్సింగ్‌రావు, ఏపీఎం భగవంత్, ఇండుబ్రో ఎండీ కోటయ్య, మేనేజర్ రాంబాబు, ట్రాన్స్‌కో ఏఈ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేయించిన ట్రాఫిక్ పోలీసులు



చేవెళ్ల, ఆగస్టు 20: చేవెళ్లలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై వర్షానికి భారీగా గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ట్రాఫిక్ సీఐ వెంకటేశం స్పందించి హైవేపై గుంతలను సీసీతో పూడ్చివేయించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాలతో రోడ్లు దెబ్బతియన్నాయని, వాహనదారులు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులు గుంతలను వెంటనే పూడ్చివేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


చేవెళ్ల బస్టాండ్‌లో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

బస్టాండ్ విస్తరణ పనులు వేగతం చేయాలి

చేవెళ్ల, ఆగస్టు 20 : చేవెళ్లలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే యాదయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం బస్‌స్టాండ్ ప్రాంగణంలో రూ.3కోట్లతో చేస్తున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. హెచ్‌ఎండీఏ నిధులు రూ.3కోట్లతో బస్టాండ్‌ను ఆధునీకీకరిస్తున్నామని తెలిపారు. ఈ పనులు చివరి దశకు చేరాయన్నారు. త్వరలోనే ప్రయాణికులకు బస్‌స్టాండ్‌ను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు వసంతం, ఆగిరెడ్డి, రాములు, పెంటయ్యగౌడ్, రాములు, ప్రభాకర్, శంకర్, నరేందర్ తదితరులు ఉన్నారు.


కొడంగల్ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చుస్తున్న ప్రయాణికులు

కిక్కిరిసిన బస్టాండ్



కొడంగల్ రూరల్, ఆగస్టు 20: రాఖీ పౌర్ణమికి అన్నదమ్ములకు రాఖీ కట్టేందుకు పుట్టింటికి వెళ్లిన మహిళలకు సొంత గ్రామాలకు పయనమయ్యారు. దీంతో కొడంగల్ బస్టాండ్ మంగళవారం కిక్కిరిసింది. ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకపోవడంతో చాలాసేపు బస్సుల కోసం ఎదురుచూశారు. బస్సులు ప్రయాణికులతో నిండిపోవడంతో చాలామంది ఫుడ్‌బోర్డుపై ప్రమాదపు అంచున ప్రయాణం చేశారు.

వర్షాలకు కళకళలాడుతున్న పంటలు


కొడంగల్ శివారులో పత్తిపంట

వారం రోజులుగా అడపదడపా వర్షాలు కురుస్తుండంతో రైతులు సాగుచేసిన పత్తి, కంది తదితర పంటలు కళకళలాడుతున్నాయి. మండలంలో రైతులు పత్తిపంటకు అడుగు మందులు, చీడపీడల నివారణకు రసాయన మందులను స్ప్రే చేయడంలో బీజీబీజీగా మారారు. దీంతో పొలంలో కాడెడ్లతో గుంటుకలను తోలడం, కూలీలతో కలుపు తీయించడం తదితర పనుల్లో నిమగ్నమయయ్యారు. పెసర పంట సాగుచేసిన రైతులు హార్వెస్టర్ యంత్రాలతో కోయించి రాసులు చేస్తున్నారు.

కొడంగల్ రూరల్, ఆగస్టు 20


చిట్లపల్లి గ్రామ శివారులో ఉన్న కందిపంట

కుండపోత

(ఐదో పేజీ తరువాయి)

పొంగి పొర్లాయి. పత్తి, అరటి, కంది, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ అధికారులు సందర్శించి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. యాలాల మండలంలో భారీ వర్షంతో చెరువు కుంటల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. భారీ వర్షానికి రాఘవపూర్ చెరువు నిండి అలుగు పారింది. రాఘవపూర్, విశ్వనాథ్‌పూర్, సంగెంకుర్దు గ్రామాల పరిధిలోని కొన్ని పంట పొలాల్లో వర్షం నీరు నిలిచి పంటలు దెబ్బతిన్నాయి. నవాబుపేట మండలంలోని మూసీ నదిలో వరద నీరు భారీగా చేరడంతో చంచల్‌పేట్, అక్నాపూర్, అత్తాపూర్, నారేగూడ, గంగ్యాడ, ముబారక్ పూర్, గుబ్బడి ఫతేపూర్ గ్రామాల మీదుగా ప్రవహిస్తుంది.


కందుకూరు: పులిమామిడిలో అలుగు పారుతున్న సాడమ్మచెరువు

మేడ్చల్ జిల్లాలో..

మేడ్చల్(ఆంధ్రజ్యోతి)/మేడ్చల్ టౌన్/కీసర రూరల్ : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో లోతట్టు ప్రాంతాలు జలమ యమయ్యాయి. కాలనీల్లోకి వరదనీరు వచ్చి చేరింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాగారం, దమ్మాయిగూడ, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో పలు కాలనీలోని సెల్లార్‌లలోకి, రోడ్లపైకి వరద నీరు వచ్చింది. చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. మేడ్చల్‌లోని సుతారిగూడ, గుండ్లపోచంపల్లి చెరువులతో పాటు మండలంలోని పలు చెరువుల్లో వర్షం నీరు చేరింది. ఎగువన ఉన్న దమ్మాయిగూడ నుంచి వరద పోటెత్తడంతో నాగారంలోని పలు కాలనీలన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా కీసర నుంచి కుషాయిగూడకు వెళ్లే దారిలో దాదాపు రెండు అడుగుల మేర వరద నీరు ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నాగారం మున్సిపాలిటీలోని లోతట్టు కాలనీలైన బీఎంఆర్ ఎన్‌క్లేవ్, సాయినగర్ కాలనీల్లోని రోడ్లు చెరువులను తలపించాయి. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు.


టంగటూరు ఉన్నత పాఠశాలలో చేరిన వర్షం నీరు

చెరువును తలపిస్తున్న రోడ్లు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోనూ సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. ఏపీజీబీవీ ఎదుట హైదరాబాద్ - శ్రీశైలం జాతీయరహదారిపై వర్షం నీరు చేరడంతో చెరువును తలపించింది.

చెరువులను తలపించిన రోడ్లు

ఇబ్రహీంపట్నం :ఇబ్రహీంపట్నం టౌన్ సహా పరిసర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం గంటపాటు దంచికొట్టడంతో రోడ్లు చెరువును తలపించాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

అలుగు పారుతున్న నాయినివాని చెరువు

కందుకూరు: మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం తెల్లవారుజాము నుంచే వాన దంచి కొట్టింది. దీంతో ధన్నారం, పులిమామిడి, జైత్వారం గ్రామాల్లోని చెరువులు, కుంటలు పూర్తిగా నిండిపోయాయి. నాయినివాని చెరువు పూర్తిగా నిండి అలుగుపారుతోంది. అలాగు కొత్తగూడ గ్రామలోని సున్నం చెరువులోకి వరద నీరు చేరుతోంది.


మైసమ్మగూడలో జలమయమైన మల్లారెడ్డి యూనివర్సిటీ


మైలార్‌దేవరంపల్లిలో వరదకు కొట్టుకుపోయిన పత్తి పంట


నాగారంలోని ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

రాఘవేందర్‌పై దాడి అమానుషం

▸ చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

వికారాబాద్/పూడూరు, ఆగస్టు 20: బీజేపీ పూడూరు మండల అధ్యక్షుడు రాఘవేందర్ ముదిరాజ్‌పై జరిగిన దాడి అమానుషమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. రాఘవేందర్‌ను బుధవారం పరామర్శించిన ఆయనఈ ఘటనపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూ కబ్జాలకు అడ్డుపడుతున్నారని కాంగ్రెస్ నాయకులు కద్మూర్ ఆనందం, అతడి అనుచరులు రాఘవేందర్‌పై రివాల్వర్‌తో బెదిరించి దాడిచేయడం అమానుషమైన చర్య అని అన్నారు. ఈ విషయంపై తక్షణమే సంబంధిత పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ దాడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోతే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. న్యాయం కోసం పోరాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి, ఉప్పరి రమేష్, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

స్వచ్ విద్యాలయ ట్రక్కు ప్రారంభం

మర్పల్లి: చేవెళ్ల నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలను శుభ్రపర్చే బాధ్యత తమ సంస్థదేనని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జేకేయంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ విద్యాలయ ట్రక్కును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గంలో దాదాపు 300పాఠశాలలు ఉన్నాయని, ప్రతీ పాఠశాలకు ట్రక్కు వెళ్లి మూత్రశాలలను శుభ్రపరుస్తుందన్నారు. ఎన్నో పాఠశాలల్లో మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రతీ ఒక్కరు బాధ్యత వహిస్తే ఈ పాఠశాల అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎంలు అంజయ్య, ఫౌండేషన్ ఇన్‌చార్జి రాములు, మర్పల్లి కో ఆర్డినేటర్ శేఖర్, సభ్యులు సంగమేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

యువతీయువకులు ఓటు నమోదు చేసుకోవాలి

▸ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఆగస్టు 20: 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ హాల్ నుంచి మంగళవారం డీఎల్‌ఎంటీలు, ఏఎల్‌ఎంటీలకు ఏర్పాటు చేసిన ట్రెయినింగ్ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతీఒక్కరికి ఓటరు జాబితాలో చోటుకల్పిస్తూ సర్వేచేయాలని బూత్‌లెవల్ అధికారులను ఆదేశించారు. ఇందుకు తగిన కార్యచరణ రూపొందించాలన్నారు. జనవరి 1, 2025 ప్రామాణికంగా ఓటరు జాబితా సవరణ 2025కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి అక్టోబర్ 29న ముసాయదా ఓటరు జాబితా విడుదల చేయాలని, నవంబర్ 28, 2024వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18, 2024వరకు బూత్‌స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటింటికీ తిరుగుతూ ఓటరు ధ్రువీకరణ చేపట్టాలన్నారు. ఓటరు జాబితాలో అవసరమైన చోట పాత ఫొటోలను తొలగించి ఓటర్ల నూతన ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. జనవరి 1, 2025 నాటికి 18సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు 100 శాతం వెరిఫికేషన్, పోలింగ్‌స్టేషన్ మార్పు అవసరముంటే చేయాలన్నారు. అక్టోబర్ 19 నుంచి అక్టోబర్ 28 వరకు జనవరి 1, 2025 ప్రామాణికంగా ఓటు హక్కు కల్పిస్తూ ముసాయిదా జాబితాన్ని రూపొందించాలన్నారు. మృతుల వివరాలను, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఓటరు జాబితా నుంచి ఫారం-7 ద్వారా తొలగించాలన్నారు. అదేవిధంగా ఫారం 6, 6ఏ, 6బీ గురించి వివరించారు. ఓటరు జాబితాలో ఉన్న మల్టీ ఎంట్రీలను తొలగించాలని, ఓటర్‌కార్డుపై ఉన్న పొరపాట్లు పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా స్థాయి, అసెంబ్లీ స్థాయి, మాస్టర్ ట్రైనర్స్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్‌అలీ పాల్గొన్నారు.

వైభవంగా సూర్యగిరి ఎల్లమ్మ బోనాలు

▸ హాజరైన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

▸ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


ఆలయంలో పూజల అనంతరం బయటకు వస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మహేశ్వరం, ఆగస్టు 20: తుక్కుగూడ పరిధి రావిర్యాలలో శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. రావిర్యాల, సర్దార్‌నగర్, తుక్కుగూడ గ్రామాల మహిళలు ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు చేసి బోనాలతో నైవేద్యాన్ని సమర్పించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, అందెల శ్రీరాములుయాదవ్, పలువురు నేతలు ఆలయంలో పూజలు చేశారు. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపైనా ఉండాలని అమ్మ వారిని కోరుకున్నట్టు బండి సంజయ్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రత్నం, మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, వీరేందర్‌గౌడ్, నర్సింహ్మారెడ్డి, జైపాల్‌రెడ్డి, కాటం భాస్కర్‌గౌడ్, పాండురంగారెడ్డి, రఘుమారెడ్డి, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.


సబ్‌స్టేషన్‌లో స్థానికులతో చర్చిస్తున్న సత్యనారాయణరెడ్డి

24గంటలు విద్యుత్ అందిస్తాం

▸ వికారాబాద్ ట్రాన్స్‌కో ఏడీ సత్యనారాయణరెడ్డి

ధారూరు, ఆగస్టు 20: ధారూరులో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి 24గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని వికారాబాద్ ట్రాన్స్‌కో ఏడీ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ధారూరు సబ్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులు, వ్యాపారులు, వినియోగదారులు, రైతులతో సమావేశమై విద్యుత్ సమస్యలపై చర్చించారు. ధారూరులో చీటికిమాటికి కరెంట్ తీస్తున్నారని, పాతకాలం నాటి విద్యుత్ స్తంబాలు, విద్యుత్ తీగలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించేలా చూడాలని కాంగ్రెస్ నాయకులు, వినియోగదారులు ఏడీని కోరారు. అనంతరం గ్రామంలోని పాత విద్యుత్ స్తంబాలను, విద్యుత్ లైన్‌ను ఏడీ పరిశీలించారు. పాత ఇనుప విద్యుత్ స్తంభాలను, అతుకులు, వేలాడిన విద్యుత్ తీగలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌పార్మర్‌ను గ్రామం మధ్యలో ఏర్పాటుచేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించి రెండు నెలల్లో ఈ సమస్యలన్నింటినీ క్లియర్‌చేసి మరోసారి సమావేశమవుతానని ఏడీ తెలిపారు. అదేవిధంగా విద్యుత్ మొండిబకాయిల విషయంలో ఎవరినీ ఉపేక్షించేదిలేదన్నారు. వినియోగదారులు బకాయిలు చెల్లించి సహకరించాలని కోరారు. డిజిటల్ విధానంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలన్నారు. గృహజ్యోతి పథకంలో అర్హులైన వారికి జీరో బిల్లులు రాకుంటే ఎంపీడీవో కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



శంషాబాద్ రూరల్, ఆగస్టు 20:రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మంగళవారం నగరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గంలో జీహెచ్‌ఎంసీ పరిధి ఐదు డివిజన్లు, ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలు, ఒక రూరల్ మండలం ఉన్నాయని సీఎంకు ఇచ్చిన వినతి పత్రంలో వివరించారు. జీవో 111తో ఇప్పటికే వెనకబడిన శంషాబాద్ మండలం ప్రభుత్వ నిధుల్లేక ప్రజలకు అవసరాలు తీర్చలేకపోతున్నామని సీఎంకు చెప్పారు ఎమ్మెల్యే. గండిపేట్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక పేదవిద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన సీఎం నియోజకవర్గానికి తప్పకుండా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న శ్రీరాం

కొడంగల్ రూరల్, ఆగస్టు 20: ప్రతీఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కొడంగల్ మున్సిఫ్ కోర్టు ప్రథమ శ్రేణి న్యాయాధికారి శ్రీరాం అన్నారు. కొడంగల్‌లో కోర్టు ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండ్లు, పూలమొక్కలను నాటారు. మామిడి, అల్లనేరేడు, ఉసిరి, జామ మొక్కలతో పాటు పూలు తదితర మొక్కలను నాటినట్లు న్యాయవాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియెషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటయ్య, సంతోష్‌కుమార్, ట్రెజరర్ కె.రమేష్, న్యాయవాదులు, కరుణాకర్‌రెడ్డి, ఏవీ.ఆనంద్, యూ.బస్వరాజ్, రవీందర్‌నాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి


మేడ్చల్ టౌన్: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 20: భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మేడ్చల్‌లో మంగళవారం రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమణారెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి నర్సింహా, బాల్‌రెడ్డి, నాగభూషణం, శేఖర్‌గౌడ్, లింగం, సంతోష్‌గౌడ్, సత్యనారాయణ, కౌన్సలర్లు కౌడే మహేష్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ 80వ జయంతి సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు మామిండ్ల ముత్యాలు యాదవ్, రాధాకృష్ణ, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు, నర్సింగరావు, చిత్తారి యాదవ్, నార్ల మల్లేష్, ఫారూక్, సునీల్, గోపాల్, బాలయ్య పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: ఘనాపూర్, ఎదులాబాద్, అవుషాపూర్ తదితర గ్రామాల్లో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎదులాబాద్‌లో నాయకులు రాజేష్, అమర్, సింగిల్‌విండో డైరెక్టర్ ఉదయ్‌కుమార్, ఓంప్రకాష్, గాయారు విశ్వనాథం, బింగి యుగేందర్‌గౌడ్, జంగ య్యయాదవ్, గట్టగల్ల రవి, జవ్వాజీ సత్తయ్య, రాజిరెడ్డి, కె.కృష్ణ, మెట్టు నర్సింహ్మా, బస్వయ్య పాల్గొన్నారు.

కీసర రూరల్: రాజీవ్ గాంధీ జయంతిని మంగళవారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, గోగుల సరిత, వెంకటేష్, మౌలా, తదితరులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: మూడుచింతలపల్లి మండలంలోని కొల్తూర్ గ్రామంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడు చింతలపల్లి మండల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాధమ్ ఆధ్వర్యంలో కొల్తూర్ గ్రామంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు యాదగిరి పాల్గొన్నారు.

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో, తూంకుంటలో రాజీవ్ గాంధీ విగ్రహానికి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి శంకర్‌గౌడ్, వలందాస్ మురళీగౌడ్,


ఘట్‌కేసర్: రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఘట్‌కేసర్ రూరల్: రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

తీగుళ్ళ మురళీగౌడ్, పిన్నించి ధర్మారెడ్డి, కొండల్‌రెడ్డి, తూంకుంట జగదీశ్వర్‌గౌడ్, రాంచందర్‌యాదవ్, తీగుళ్ళ దర్శన్‌గౌడ్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా శామీర్‌పేట మండలంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బషీరాబాద్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం బషీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నవాంద్గీ సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే తనయుడు రోహిత్‌మహరాజ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కలాల్ నర్సింహులుగౌడ్, అనూప్, మునీర్, కాంగ్రెస్ నాయకులు పవాన్‌ఠాగూర్, రాజన్న, శ్రీనివాస్, నరేష్‌చౌహాన్, రియాజ్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్: రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని కుదురుమళ్ల గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహులు, యాదగిరిరెడ్డి, మోహన్‌రెడ్డి, రఘుపతి, శ్రీనివాస్, ప్రకాశ్, రాములు పాల్గొన్నారు.

యాలాల: రాజీవ్ గాంధీ దేశానికి ఆదర్శమని యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకోని మంగళవారం యాలాలలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్ బాబా, కాంగ్రెస్ నాయకులు రాపోల్ నాగయ్య, మారుతి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, హైమద్, అశోక్, చందు పాల్గొన్నారు.

పెద్దేముల్: మండల కేంద్రంలో మంగళవారం రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేశారు. ఈకార్యక్రమంలో రియాజ్, శోభారాణి, నల్ల ఎల్లారెడ్డి, ప్రవీణ్ కుమార్‌గుప్త, నసీర్, బీసీసెల్ మండల అధ్యక్షుడు ఆనందం, డీవై.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


బషీరాబాద్: రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నివాళి


యాలాల: మండల కేంద్రంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుంటున్న కాంగ్రెస్ నాయకులు


కీసర రూరల్: రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


మూడుచింతలపల్లి: కొల్తూర్‌లో రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వ్యవసాయ కార్యాలయానికి రైతుల తాకిడి


అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న రైతులు

తాండూరు రూరల్, ఆగస్టు 20: మండల పరిషత్ కార్యాలయంలోని వ్యవసాయ కార్యాలయానికి రైతుల తాకిడి నెలకొంది. ప్రభుత్వం రూ.2లక్షల లోపు రుణమాఫీ చేయడంతో తమ రుణాలు మాఫీ అయ్యాయా? లేదా? తెలుసుకోవడానికి ఆధార్ కార్డు, పాస్‌బుక్కుతో వ్యవసాయ కార్యాలయానికి వివిధ గ్రామాల రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. రుణమాఫీ ఎప్పుడూ అవుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు రుణమాఫీ వెంటనే చేయాలి

కొడంగల్, ఆగస్టు 20: రుణమాఫీ కాని రైతులకు వెంటనే చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య అన్నారు. మంగళవారం వారు స్థానిక ఐబీలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులందరికి రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చినా పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా రైతు రుణమాఫీ కాని రైతులను గుర్తించి ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు చంద్రప్ప, దస్తప్ప, మోహన్, లక్ష్మణ్, చందు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఎదుట మురుగు తొలగింపు


మురుగు నీరు తొలగిస్తున్న సిబ్బంది

తాండూరు, ఆగస్టు 20: ఎట్టకేలకు ఐదురోజుల తర్వాత తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఉన్న మురుగు నీటిని తొలగించారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హబీబ్ లాల ఆస్పత్రి అధికారులతో చర్చించి సిబ్బందితో నీరు తొలగించేలా చొరవ తీసుకున్నారు. ఐదు రోజులగా మున్సిపల్ అధికారులు కనీసం అటువైపు చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ అధికారులు పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

కేజీబీవీలో విద్యార్థులకు కంటి పరీక్షలు

బషీరాబాద్, ఆగస్టు 20: మండల కేంద్రంలోని కేజీబీవీలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు స్వామినాథ్ ఆధ్వర్యంలో వైద్య బృందం 5 నుంచి పదోతరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. మొత్తం 229 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు జరుపగా 10మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. కళ్లజోళ్లు అవసరమైన విద్యార్థులకు ప్రభుత్వం తరఫున ఉచితంగా అందజేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సమిత్ర, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కేజీబీవీలో నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దోమ, ఆగస్టు 20: కేజీబీవీలో నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో హరిచందర్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మాట్లాడారు. సహాయక వంట మనిషి, స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈనెల 24లోపు ఆసక్తి కలిగిన వారు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. 7వ తరగతి విద్యార్హత కలిగి ఉండి 18-45 సంవత్సరాల వయసు కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పూడూరు: పూడూరు మండల పరిధిలోని కేజీబీవీ పాఠశాలల్లో నాన్ టీచింగ్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి హరిశ్చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని దోమ, పూడూరు కేజీబీవీ పాఠశాలల్లో సహాయక వంట మనిషి, స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ పోస్టులకు సంబంధించి కనీస అర్హత 7వ తరగతి చదివి, స్థానిక మండల వాసులై ఉండాలని, 18-45 సంవత్సరాల మహిళలు మాత్రమే అర్హులని తెలిపారు. ఈనెల 24వ తేదీ లోపు మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తుకు ఆధార్‌కార్డు జతచేసి సమర్పించాలని కోరారు.

పేదలను ఆదుకోవడమే ధ్యేయం

శామీర్‌పేట, ఆగస్టు 20: అనారోగ్యంతో బాధపడుతున్న పేదలను ఆర్థికంగా ఆదుకోవడమే సీఎం సహాయనిధి ధ్యేయమని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేటకు చెందిన సావిత్రికి రూ.60వేలు, మజీద్‌పూర్ గ్రామానికి చెందిన జ్యోతికి రూ.30వేలు విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేటకు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌కు చెందిన ఇద్దరు లబ్ధిదారులకు మంగళవారం మాజీమంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి నగరంలోని తన నివాసంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేశారు. ఎదులాబాద్‌కు చెందిన ఎర్రోళ్ల పోన్నమకు రూ.30వేలు, గోసుకొండ మహేష్‌యాదవ్‌కు రూ.21 వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి, ఎర్రోళ్ళ శ్రీనివాస్, ఎర్రోళ్ళ సుదర్శన్, అశీష్‌రెడ్డి, వేముల శరత్‌గౌడ్ పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ రూరల్: లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

బొంరాస్‌పేట్, ఆగస్టు 20: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గొరారం గోపాల్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా దోషులను శిక్షించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బెంగాల్ ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. మహిళల రక్షణకు కఠిన చట్టాలను రూపొందించాలన్నారు.


ఘట్‌కేసర్ రూరల్: కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న గ్రామస్థులు

అవుషాపూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

ఘట్‌కేసర్ రూరల్: కోల్‌కత్తాలో జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ మండలంలోని అవుషాపూర్‌లో మంగళవారం రాత్రి మహిళలు, గ్రామస్తులు, నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నిందితులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. మహిళా డాక్టర్ల రక్షణకు ప్రత్యేకచట్టాలు తీసుకురావాలన్నారు.న్యాయం చేయాలని కొవ్వొత్తులతో ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డుసభ్యురాలు కవాడి శిరీషవామన్‌రెడ్డి, కందకట్ల దివ్యదయాకర్‌రెడ్డి, రాధాబాలకృష్ణ, తేజస్విని, స్వరూప, వామన్‌రెడ్డి, మాధవరెడ్డి, కొట్టి శ్రీకాంత్‌రెడ్డి, సాయి, సందీప్‌రెడ్డి, జీకే.చిన్నయాదవ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

శామీర్‌పేట, ఆగస్టు 20: తూంకుంట పరిధిలోని శ్రీగాయత్రి మహాక్షేత్రంలో మంగళవారం శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు కనుల పండువగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు, వాక్‌బ్రహ్మ శిష్యజనోద్ధారక డాక్టర్ ఎస్‌వీఎల్ఎన్ మూర్తి, బ్రహ్మణ వేదపండితులు శ్రీరాఘవేంద్ర స్వామికి మంత్రోచ్ఛరణలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీరాఘవేంద్రస్వామికి నిర్మల్యవిసర్జన, ఫల పంచామృతాభిషేకం, పాదపూజ, కనకాభిషేకం, తులసి అర్చన, తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీరాఘవేంద్రస్వామికి పూజలు చేశారు.


శామీర్‌పేట్: శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

తాండూరు: తాండూరు పట్టణం చెనెగేషపూర్ రోడ్డులో కోలువైన శ్రీరాఘవేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం ఆరాధనోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ పూజా కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛరణలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణం రాఘవేంద్రస్వామి నామస్మరణతో మారుమోగింది. ఆరాధనోత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొంట స్వప్న పరిమళ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో అన్నదానం చేశారు.

కాంగ్రెస్ సీనియర్ నేత నారాయణరెడ్డి మృతి


నారాయణరెడ్డి

పరిగి, ఆగస్టు 20: కాంగ్రెస్ సీనియర్‌నేత, డీసీసీ ఉపాధ్యక్షుడు బి.నారాయణరెడ్డి మృతి చెందారు. మండలంలోని చిట్యాల్ గ్రామానికి చెందిన నారాయణరెడ్డి కొంతకాలం నుంచి అనారోగ్యంలో బాధపడుతున్నారు. మంగళవారం వారి స్వగ్రామంలో మృతి చెందారు. పలువురు కాంగ్రెస్ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని ప్రకటించారు.

సంక్షిప్తంగా..

- **దోమ:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకంలో జీరో బిల్లు రాని వారు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మహేశ్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఆధార్ కార్డుతో కార్యాలయానికి వచ్చి జీరో విద్యుత్ బిల్లు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.
- **శామీర్‌పేట:** శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడ్చల్ మండలం గుండ్లపోచంపల్లి మున్సిపల్ అర్కెలగూడంకు చెందిన వాసగౌని చంద్రయ్యగౌడ్ జ్ఞాపకార్థం ఆయన భార్య వెంకటమ్మ, కుమారుడు వెంకటేష్‌గౌడ్, రజిత దంపతులు అన్నదానం చేశారు.
- **మేడ్చల్ టౌన్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎంఆర్‌ఈసీ కళాశాలలో మంగళవారం అమెచ్యూర్ రెడియో వైర్‌లెస్ ప్రయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రయోగాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ అశోక్, హెచ్‌వోడీ సంపత్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
- **దౌల్తాబాద్:** బీజేపీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు రమేశ్ కుటుంబాన్ని ఎంపీ డీకే.అరుణ పరామర్శించారు. ఇటీవలే బంటు రమేశ్ తల్లి బంటు అంజమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ డీకే.అరుణ మంగళవారం నియోజకవర్గంలో పర్యటనలో నందారం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.
- **బషీరాబాద్:** 2024-25 సంవత్సరానికి గాను ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలు ఈనెల 8వ తేదీన ప్రారంభమైనట్లు బషీరాబాద్ మండల ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ మహమ్మద్ షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుము లేకుండా సెప్టెంబర్ 10తేదీలోపు ఆన్‌లైన్- మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రశీదును బషీరాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు)లో ఇవ్వాలన్నారు. వివరాలకు 8328413321 నెంబరుకు డయల్ చేయాలని సూచించారు.

ముగిసిన ఉర్సే -ఎ-షరీఫ్ ఉత్సవాలు

తాండూరు, ఆగస్టు 20: తాండూరు హజ్రత్ సయ్యద్ అబ్దుల్ సలాం పాషా సాహెబ్ ఖిల్లా చిష్తి ఉర్సే -ఎ - షరీఫ్ ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. నాలుగు రోజులుగా ఈ ఉత్సవాలు ముతవల్లి సయ్యద్ అబ్దుల్ గని షాష ఆధ్వర్యంలో కొనసాగాయి. మంగళవారం సమాజ్ బాద్ ఫజర్ తిలావర్ ఖురాన్, ఫాతెహఖ్వాలి, ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేష్‌గౌడ్

పూడూరు, ఆగస్టు 20: మండల కేంద్రంలో బీజేపీ అధ్యక్షుడు రాఘవేందర్, బీఆర్ఎస్ నాయకుడు రాంచంద్రిని మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశం పరామర్శించారు. మంగళవారం ఈ సందర్భంగా మహేష్‌రెడ్డి మాట్లాడుతూ హత్యాయత్నంకు పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి


రాములు(ఫైల్)

కులకచర్ల, ఆగస్టు 20: మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామంలో రైతు రాములు (48) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సోమవారం రాత్రి పొలం దగ్గర బోరు మోటార్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై గొడ్డలితో హత్యాయత్నం

బషీరాబాద్, ఆగస్టు 20: ఓ పాత నేరాస్తుడు అకారణంగా ఓ వ్యక్తితో గొడవ పెట్టుకుని గొడ్డలితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామంలో మంగళవారం ఉదయం జరిగింది. ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్మాయి గ్రామానికి చెందిన బోయిని నాగప్ప(పాత నేరాస్తుడు) కిరాణ దుకాణం వద్ద ఉండగా అక్కడికి సిరిగారి శ్యామ్ అనే వ్యక్తి వచ్చాడు. ఈ క్రమంలో అప్పటికే మద్యం మత్తులో ఉన్న నాగప్ప.. శ్యామ్‌తో దూరుసుగా ప్రవర్తిస్తూ గొడవకు దిగాడు. ఇరువురి మధ్య మాటామాటా పెరడగంతో శ్యామ్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. శ్యామ్ ఇంటికి వెళ్తూ తనపై గొడవకు దిగిన విషయమై నాగప్ప భార్యకు చెప్పి వెళ్లిపోయాడు. దీంతో ఇంటికి వచ్చిన నాగప్పకు భార్య అడగటంతో కోపోద్రుక్తుడైన నాగప్ప గొడ్డలి తీసుకుని శ్యామ్ ఇంటికి వెళ్లి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో శ్యామ్‌కు తల, వీపుపై గొడ్డలివేటు వేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితున్ని వెంటనే బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రమేష్‌కుమార్ ఆదేశానుసారం పోలీసులు గ్రామానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, నిందితుడికి గతంలోఓ ఓ వ్యక్తిని చంపిన కేసుతో పాటు మరో రెండు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బంట్వారం ఆగస్టు 20: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని సల్బత్తాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన కొడిచర్ల రాజారావు(36) గ్రామంలో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు 108 వాహనంలో తాండూర్ జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 11గంటలకు మృతిచెందాడు. మృతుడి అక్క రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి, ఏఎస్ఐ శ్రీను తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుటుంబ సభ్యులకు అప్పగించామని వారు తెలిపారు.

మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యం


మాలె శ్రీనివాస్

పెద్దేముల్, ఆగస్టు 20: మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమైన ఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మాలె శ్రీనివాస్(30) 10 సంవత్సరాల నుంచి మతిస్థిమితం కోల్పోయి గ్రామంలోనే తిరుగుతుండేవాడు. ఇంటికి కూడా వస్తుండేవాడు. కానీ 10రోజుల నుంచి ఇంటికి రావడం లేదు. ఎక్కడ వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో తనకుమారుడి ఆచూకి కనిపెట్టగలరని శ్రీనివాస్ తండ్రి మాలె శివప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

లారీ చోరీ.. నిందితుడి అరెస్ట్

తాండూరు రూరల్, ఆగస్టు 20: లారీ చోరీ చేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కరన్‌కోట్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరుకు చెందిన ఎండీ.ఆసీఫ్ తన లారీని రోజూ మాదిరిగా సోమవారం రాత్రి కరన్‌కోట్‌లోని వివేకానంద విగ్రహం వద్ద పార్కింగ్ చేశాడు. అయితే, మంగళవారం వచ్చి చూసేసరికి లారీ కనిపించలేదు. దీంతో లారీ యజమాని ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు కరన్‌కోట్‌కు చెందిన వడ్డె కాశప్పగా గుర్తించారు. లారీని గుల్బర్గకు తీసుకెళ్లి విక్రయించుకుదామని తీసుకెళ్తుండగా మార్గమధ్యలో డీజిల్ అయిపోవడంతో లారీ అక్కడే వదిలేసి వెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు లారీని స్వాధీనం చేసుకుని, నిందితున్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. గతంలోనూ వడ్డె కాశప్ప లారీని చోరీ చేయగా కేసు నమోదైందన్నారు. కాశప్పను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు డీజిల్ ట్యాంకర్ బోల్తా


బోల్తాపడిన డీజిల్ ట్యాంకర్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 20: ప్రమాదవశాత్తు ఓ డీజిల్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అవుషాపూర్ హెచ్‌పీసీఎల్ నుంచి డీజిల్ లోడ్‌తో హైదారాబాద్‌కు వెళ్తుండగా ట్యాంకర్ జాతీయ రహదారి సర్వీసు రోడ్డు వైపు వస్తుండగా ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.డీజిల్ బయటకు లీక్ కాకుండా హెచ్‌పీసీఎల్ అధికారులు ట్యాకర్‌కు లాక్‌చేశారు. సర్వీసు రోడ్డులో వాహనదారులు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

బైక్‌పై మెల్లగా వెళ్లమన్నందుకు దాడి

వికారాబాద్, ఆగస్టు 20: బైక్‌పై మెల్లగా వెళ్లమన్నందుకు ఓ పాదచారున్ని బైక్‌పై వెళ్తున్న యువకులు దాడికి దిగాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి వికారాబాద్‌లో చోటుచేసుకుంది. పట్టణంలోని ప్రధాన రోడ్డుపై ముగ్గురు యువకులు ఒకే బైక్‌పై అతివేగంగా వెళ్తుండగా వికారాబాద్‌కు చెందిన కిష్టయ్య మెల్లిగా వెళ్లొచ్చుకదా అని అన్నాడు. దీంతో బైక్‌పై వెళ్తున్న యువకులు కిష్టయ్యపై దాడికి దిగాడు. దీంతో అక్కడ జనం గుమిగూడటంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గాయాలపాలైన కిష్టయ్యను స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వివరాలు సేకరించారు.

లక్ష్మీనారాయణ చెరువును సందర్శించిన డీసీపీ


లక్ష్మీనారాయణ చెరువును పరిశీలిస్తున్న మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 20: వినాయక నిమజ్జనం సందర్భంగా మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజారెడ్డి మంగళవారం మండలంలోని ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువును సందర్శించారు. ఏటా వినాయక నిమజ్జనం ఏర్పాట్లు ఎప్పటినుంచి చేస్తారు? ఎన్ని వినాయకులు నిమజ్జనం చేస్తారు? నగరం నుంచి ఏఏ ప్రాంతాల నుంచి వినాయకుల నిమజ్జనం చేస్తారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అయా శాఖల అధికారుల సమన్వయంతో వినాయక నిమజ్జనం సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లిపావని, కమిషనర్ సాబేర్ అలీ, సీఐలు సైదులు, రాజువర్మ, డిప్యూటీ తహసీల్దారు రాజేందర్, ఎస్ఐలు శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాండూరు మండల వ్యవసాయాధికారిగా కొమురయ్య


కొమురయ్య

తాండూరు రూరల్, ఆగస్టు 20: తాండూరు మండల వ్యవసాయాధికారిగా కొమురయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఏవో రజిత పరిగికి బదిలీపై వెళ్లిన విషయం విధితమే. ఆమె స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ కార్యాలయంలో పనిచేస్తున్న కొమురయ్య తాండూరుకు బదిలీపై వచ్చారు. ఆయన మంగళవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవోగా బాధ్యతలు చేపట్టారు.

పంచాయతీ కార్యదర్శులను విమర్శించడం సరికాదు

మర్పల్లి, ఆగస్టు 20: పంచాయతీ కార్యదర్శులను విమర్శించడం సరైంది కాదని టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవిశశి అన్నారు. సోమవారం జరిగిన రెవెన్యూ మంత్రి సమావేశంలో ఓ రిటైర్డ్ తహసీల్దార్ పంచాయతీ కార్యదర్శులు కేవలం ట్రాక్టర్, మోటార్ మరమ్మతులకు మాత్రమే పనికి వస్తారని, మరెందుకు పనికి రారు అని విమర్శించడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రాంచందర్, లక్ష్మీకాంత్, చంద్రయ్య, మాధవరెడ్డి, కిరణ్‌కుమార్, ప్రశాంత్, శ్రీనివాస్, ఆనందం, మహేశ్, జ్యోతిర్లింగం తదితరులు పాల్గొన్నారు.